సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం । 16 । జూలై । 2025



బోధనేతర కత్తి

పాఠశాల తెరిచి నెల రోజులు పూర్తవుతున్నా విద్యాశాఖ తీసుకుంటున్న నిర్ణయాలతో నేటికీ పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు తరగతి గదికి హాజరుకాలేని పరిస్థితి. 8లో ▸



భవిష్యత్‌కు బాటలు వేయాలి

ట్రిపుల్ ఐటీ పీయూసీలో చేరిన విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ సూచించారు. 8లో ▸



కోకో దిగుమతులు ఆపాలి

విదేశీ కోకో గింజల దిగుమతులను నిలుపుదల చేసి, కోకో రైతులకు అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం డిమాండ్ చేసింది. 8లో ▸

న్యూస్‌రీల్

గిట్టుబాటు ధర కోసం పోరాటం



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఘంటశాల గాంధీ తదితరులు

జంగారెడ్డిగూడెం: వర్జీనియా రైతులు **నష్టపో**కుండా గిట్టుబాటు ధర కోసం **పోరాటం** చేద్దామని మాజీ ముఖ్యమంత్రి, **వైఎస్సార్‌సీపీ** అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అన్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు ఘంటశాల గాంధీ అన్నారు. మంగళవారం వర్జీనియా పొగాకు సంఘం రైతు నాయకుడు, వైఎస్సార్‌సీపీ నేత గాంధీ వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గాంధీ వర్జీనియా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. గాంధీ మాట్లాడుతూ వర్జీనియా పొగాకుకు మంచి ధర ఇప్పించేందుకు కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. స్పందించిన జగన్‌మోహన్‌రెడ్డి వీలును బట్టి మరోసారి వర్జీనియా వేలం కేంద్రాలను సందర్శిస్తానని తెలిపారన్నారు. గిట్టుబాటు ధర కోసం పోరాటం చేద్దామని జగన్ పేర్కొన్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో బండారు సూరిబాబు, బుద్దాల సత్యనారాయణ, బండారు రత్నవల్లి ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగ కార్యదర్శిగా మోషే

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన తాడేపల్లి మోషేను రాష్ట్ర ఎస్సీ విభాగ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు తేదీని పొడిగించినట్లు డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ, స్థానిక సంస్థల, మున్సిపల్, ఏపీ మోడల్, గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించడానికి తొలుత ఈ నెల 15వ తేదీ వరకూ గడువు ఇవ్వగా, గడువును ఈ నెల 17 వరకు పొడిగించారని తెలిపారు. దరఖాస్తులు సమర్పించడానికి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు అర్హులు కారని, సంబంధిత సంవత్సరంలో కనీసం నాలుగు నెలలు విధులు నిర్వహించిన వారు ఇతర అర్హతలన్నీ పూర్తిగా ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నైట్ వాచ్‌మెన్ల జీతాలు చెల్లించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలలలో రాత్రిపూట కాపలాదారుగా పనిచేస్తున్న నైట్ వాచ్‌మెన్ జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద నైట్ వాచ్‌మెన్ జీతాలు చెల్లించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ధర్నాలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బుచ్చిబాబు మాట్లాడుతూ నైట్ వాచ్‌మెన్‌ల గౌరవ వేతనం నెలల తరబడి చెల్లించడం లేదని విమర్శించారు. దీంతో వారి కుటుంబాల జీవనం చిన్నాభిన్నం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీతం తక్కువ పని ఎక్కువ చేయిస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించాలి

ఏలూరు (టూటౌన్): విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపును ప్రజలంతా వ్యతిరేకించాలని వామపక్ష, ప్రజా సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ మంగళవారం ఉదయం ఏలూరు సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో వామపక్ష ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షత వహించారు. ఈ నెల 13న విజయవాడ దాసరి భవన్‌లో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా చేసిన ఉద్యమ కార్యాచరణను కృష్ణ చైతన్య వివరించారు. గత కొంతకాలంగా విద్యుత్ వినియోగదారులపై ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలు, ఇతర అదనపు చార్జీల పేరుతో అధిక భారాన్ని మోపుతూ వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలపై మోపిన అధిక భారాలను రద్దు చేయాలని, వసూలు చేసిన అదనపు బిల్లులను తిరిగి చెల్లించాలని, విద్యుత్తు స్మార్ట్ మీటర్లు బిగింపు కార్యక్రమాన్ని విడనాడాలని డిమాండ్ చేశారు.

జాడలేని వానలు

ముసురు పట్టాల్సిన సమయంలో వర్షం జాడే లేకుండా పోయింది. జూలై నెలలో సాగు పనులు జోరుగా సాగుతాయి. ఈ నెలలో 96.5 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇంతవరకు సగం కూడా కురవలేదు. మండు వేసవిని తలపిస్తూ ఎండలు మండిపోతున్నాయి. పగలు ఎండ, రాత్రిళ్లు ఉక్కపోతతో ప్రజల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ పనులకు ఆటంకం ఏర్పడింది.



యలమంచిలి మండలం మేడపాడులో తొలకరి పనులకు నోచుకోని పంట పొలాలు

- 38 డిగ్రీల ఉష్ణోగ్రతతో వేసవిని తలపిస్తున్న ఎండలు, ఉక్కపోత
- ఈ నెలలో సాధారణ వర్షపాతం 96.5 మి.మీ.. కురిసింది 25.5 మి.మీ
- వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ పనులు నత్తనడక
- 31 వేల ఎకరాల్లో మాత్రమే పూర్తయిన నాట్లు
- 30 శాతం విస్తీర్ణంలో మొదలుకాని తొలకరి దమ్ములు



సాయంత్రం 4 గంటలకు వెలవెలబోతున్న భీమవరంలోని ప్రకాశంచౌక్ సెంటర్

సాక్షి, భీమవరం: ఈ ఏడాది రుతుపవనాలు సకాలంలోనే వచ్చినా ప్రతికూల వాతావరణం వెంటాడుతోంది. గత నెల్లో దంచి కొట్టిన వర్షాలు జూలైలో పత్తాలేకుండా పోయాయి. వాతావరణశాఖ లెక్కల ప్రకారం మే నెలలో జిల్లాలో 72.6 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా రికార్డుస్థాయిలో 139 మి.మీ వర్షం కురవడం గమనార్హం. సాధారణం కంటే 66.4 మి.మీ అధిక వర్షపాతం నమోదైంది. జూన్ నెలలో 110.4 మి.మీ సగటు వర్షపాతానికి 125.5 మి.మీ వర్షంతో 15.1 మి.మీ అధిక వర్షపాతం నమోదైంది. ఈ రెండు నెలల్లో అవసరం లేని సమయంలో అధిక వర్షాలు మామిడి రైతులను నిండా ముంచాయి. పండుఈగ వ్యాప్తితో ధర పతనమై నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మే, జూన్ నెలల్లో తాడేపల్లిగూడెం, పెంటపాడు, ఆకివీడు, మొగల్తూరు, భీమవరం, పెనుగొండ, పాలకోడేరు, ఇరగవరం, వీరవాసరం, పాలకొల్లు, గణపవరం మండలాల్లో సాధారణానికి మించి అధిక వర్షపాతం నమోదైంది.

అవసరమైన సమయంలో.. తొలకరి పనులకు ఊతమిస్తూ ఈ నెలలో విస్తారంగా వానలు కురవాల్సి ఉంది. జూలై నెలకు 96.5 మి.మి వర్షం పడాలి. అప్పుడే సగం నెల పూర్తికాగా ఇప్పటి వరకు కేవలం 25.5 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. జిల్లాలోని అత్తిలి, పెనుమంట్ర, పెనుగొండ, పాలకోడేరు, ఆకివీడు, అత్తిలి, తాడేపల్లిగూడెం, పెంటపాడు తదితర మండలాల్లో ఈ నెలలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈశాన్య ప్రాంతంలోని ఉపరితల ఆవర్తనం, ద్రోణి వలన వర్షాకాలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉష్ణోగ్రతలు పెరిగాయని వాతావరణశాఖ నిపుణులు చెబుతున్నారు.

తొలకరికి ఆటంకం

వర్షాభావ పరిస్థితులతో తొలకరి పనులకు ఆటంకం ఏర్పడుతోంది. 2.08 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరగనుంది. నవంబరు చివరలో వచ్చే తుఫాన్ల బారిన పడకుండా ముందుగానే పంటను ఒబ్బిడి చేసుకునేందుకు జూలై 15లోగా నాట్లు పూర్తిచేయాల్సి ఉండగా ఈ సీజన్‌లో పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. క్లోజర్ పనుల జాప్యం, ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందకపోవడం, వర్షాలు లేక సాగునీటి ఎద్దడి సమస్యలతో పనులు ముందుకు సాగడం లేదు. ముందస్తు సాగులో భాగంగా ఈపాటికే నాట్లు దాదాపు పూర్తి కావాల్సి ఉంది. పెనుగొండ, పోడూరు, ఆచంట, యలమంచిలి తదితర మండలాల్లో 30 శాతం విస్తీర్ణంలో ఇంకా దమ్ములు కూడా చేయని పరిస్థితి ఉంది. కాలువలకు సరిగా నీరు విడుదల కాకపోవడం, ఎండల తీవ్రతకు నారుమడులు ఎండిపోతున్నాయని, పొలాలు నెరలు తీస్తున్నాయని ఆయా ప్రాంతాలకు చెందిన రైతులు వాపోతున్నారు. కాగా జిల్లాలో నారుమడులు పోయడం దాదాపు పూర్తయ్యిందని, ఇప్పటి వరకు 31 వేల ఎకరాల్లో నాట్లు పడినట్టు జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

వర్షాకాలంలో వేసవిని తలపిస్తూ ఎండలు మండిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల నుంచి 38 డిగ్రీలు ఉంటుండగా రాత్రి ఉష్ణోగ్రతలు 26 డిగ్రీల నుంచి 28 డిగ్రీల వరకు ఉంటున్నాయి. ఎండల తీవ్రతకు తోడు ఉక్కపోత వాతావరణం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సాయంత్రం ఆరు దాటినా ఎండ తీవ్రత కొనసాగుతోంది. మధ్యాహ్నం అయ్యే సరికి రోడ్లు, ప్రధాన కూడళ్లు దాదాపు జనసంచారం లేక వెలవెలబోతున్నాయి. ఉపశమనం కోసం ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా పనిచేస్తున్న గృహోపకరణాలతో విద్యుత్ వినియోగం బాగా పెరిగింది.

నారుమడిని సంరక్షించుకోవాలి



ప్రస్తుత ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల నారుమడులకు నష్టం వాటిల్లకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం శాస్త్రవేత్త ఎంవీ కృష్ణాజీ తెలిపారు. లీటరు నీటికి 10 గ్రాముల యూరియా చొప్పున ఎకరా నారుమడికి పది లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేయాలని లేదా లీటరు నీటికి మల్టీకే (13045) 10 గ్రాములు చొప్పున పది లీటర్ల ద్రావణాన్ని పిచికారి చేయొచ్చన్నారు. దీని వల్ల 10 నుంచి 15 రోజుల పాటు నారుమడి దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇనప ధాతువు లోపం వచ్చే అవకాశం ఉందని, దీని నివారణకు ఫెరస్ సల్ఫేట్ 10 గ్రాములు, నిమ్మ ఉప్పు 2 గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేయాలన్నారు.

మీ మెడకే చుట్టుకుంటుంది

మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



మాధవరంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: చెడు సంస్కృతిని మొదలుపెడితే అది మీ మెడకే చుట్టుకుంటుందనే విషయాన్ని గుర్తించాలని మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని మాధవరంలో వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జెడ్పీ చైర్‌పర్సన్ హారిక కారుపై దాడి చేసి, దుర్భాషలాడి టీడీపీ రౌడీలు విధ్వంసం సృష్టించారని, ప్రస్తుతం బాబూ ష్యూరిటీ– గూండాయిజం గ్యారంటీ అనే చందంగా ప్రభుత్వ పాలన మారిందని విమర్శించారు. ఒకప్పుడు పవన్ చంద్రబాబు, లోకేష్‌ను విమర్శించారని, నేడు ఒకే గూటికి చేరారన్నారు. పవన్ పొలిటికల్‌గా అట్టర్ ఫ్లాప్ అని ఎద్దేవా చేశారు. 10వ తరగతి పరీక్షలు వాల్యుయేషన్ జవాబుదారీతనం లేకుండాపోయిందన్నారు. చైనా బ్యాచ్ గుప్పెట్లో విద్యా వ్యవస్థఉందన్నారు. రాష్ట్రానికి సీఎంగా ఉండి ప్రైవేట్ విద్యాసంస్థలను ప్రోత్సహించేలా చంద్రబాబు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. స్థానిక ప్రజాప్రతినిధికి, పవన్ కళ్యాణ్‌కు గ్యాప్ వచ్చినట్టు ఉందన్నారు. పవన్ కల్యాణ్ గురించి మాట్లాడితే ఊరుకోబోమంటూ చిర్రుబుర్రులాడుతున్నాడని, ఊరుకోకపోతే పీక పిసుక్కుంటావా? అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. రాజకీయాల్లోకి రానంత వరకే వ్యక్తిగతం అని, రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత అందరూ ప్రశ్నిస్తారన్నారు. జగన్ 2.0లో హాలీవుడ్ స్థాయిలో సినిమా చూపిస్తామని హెచ్చరించారు. ఇటీవల తనపై అవినీతి ఆరోపణలు చేశారని, దానికి ఆధారాలు చూపించాలని ఆయన సవాల్ విసిరారు.

వర్జీనియాకు సరాసరి ధర ఇప్పించాలి



జంగారెడ్డిగూడెం వర్జీనియా వేలం కేంద్రం-1లో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: వర్జీనియా పొగాకు ధర క్రమేపీ పెరుగుతోంది. మంగళవారం నాటికి కేజీ ఒక్కింటికి అత్యధికంగా రూ.359కు చేరింది. జంగారెడ్డిగూడెం 1, 2 వేలం కేంద్రం, కొయ్యలగూడెం వేలం కేంద్రంలో ఈ ధర రూ.359కు చేరింది. వేలం ప్రారంభ సమయంలో కేవలం కేజీ ధర రూ.290 పలికింది. ఈ ధర చాలా రోజులు స్థిరంగానే కొనసాగింది. కొద్ది రోజులుగా పెరుగుతూ 359కు చేరింది. కేజీ అత్యల్ప ధర రూ.200 ఉండగా, సరాసరి కేజీ ధర రూ.277కు చేరింది. గత ఏడాది వేలం ప్రక్రియ ముగిసే సరికి సరాసరి కేజీ ధర రూ.323 లభించింది. ఈ ఏడాది కూడా సరాసరి ధర అంతే ఇప్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కూటమి మోసాలను ఎండగట్టాలి

భీమవరంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు



'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు

భీమవరం: కూటమి నాయకులు ప్రజలను మోసం చేయడంలో సిద్ధహస్తులని, వారి మోసాలను 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు పిలుపునిచ్చారు. భీమవరం మండలం రాయలంలో పార్టీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు అధ్యక్షతన జరిగిన పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడం, కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టించి పనిచేయాలని అలా పనిచేసినవారికి తప్పక గుర్తింపు ఉంటుందని ప్రసాదరాజు స్పష్టం చేశారు. అధికార పార్టీ నాయకులు పెట్టే కేసులు, ఇబ్బందులకు భయపడాల్సిన అవసరం లేదని వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టం చేయడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని గ్రామ, వార్డుస్థాయిలో పార్టీ పదవుల నియామకాలు పూర్తిచేసి పటిష్టంగా పార్టీ కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు.


ఆక్వాను పట్టించుకోరా?: మురళీకృష్ణంరాజు

పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తున్నారని మండిపడ్డారు. ఆక్వా రంగం నిర్వీర్యమైపోతున్నా పట్టించుకున్న నాథుడే లేడని కూటమి పాలనలో ఏవర్గం ప్రజలకు మంచి జరగలేదన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేస్తే నేటి కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్పుల సొమ్మంతా ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. నరసాపురం పార్లమెంట్ సమన్వయకర్త గూడూరి ఉమాబాల మాట్లాడుతూ జగన్ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రజలను ఏ విధంగా మోసం చేస్తున్నారో తెలియచేయాలన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధులు మేడిది జాన్సన్, కామన నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో అప్పులు కుప్పలు తప్ప ప్రజలకు ఒరిగింది ఏమి లేదని దుయ్యబట్టారు. నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహరావు, ఎంపీపీ పేరిచర్ల నర్సింహరాజు, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, యూత్ అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, భీమవరం పట్టణ, వీరవాసరం, భీమవరం రూరల్ మండల పార్టీ అధ్యక్షులు గాదిరాజు రామరాజు, చవ్వాకుల సత్యనారాయణ, జల్లా కొండయ్య, పార్టీ నాయకులు పాలవెల్లి మంగ, ఇంటి సత్యనారాయణ, నాగరాజు శ్రీనివాసరాజు, కోడే యుగంధర్, నేతల జ్ఞానసుందరరాజు, పెనుమాల నర్సింహస్వామి, మద్దాల అప్పారావు, తిరుమాని ధనుంజయ, షేక్ రబ్బాని, రాజా బాలమస్తానయ్య, అల్లూరి రవిరాజు, మానుకొండ ప్రదీప్, డీవీడీ ప్రకాష్, పేరిచర్ల సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

నీరందక రైతుల కన్నీరు



వెంకటాపురంలో పొలాల వద్ద ధర్నా చేస్తున్న రైతులు, కౌలు రైతులు



నీరులేక నెరలిచ్చిన భూమి

ఏలూరు- కైకలూరు రోడ్డును దిగ్బంధిస్తామని హెచ్చరిక

దెందులూరు: సాగునీరు అందక వరి నారుమళ్లు ఎండిపోతున్నాయని, నాట్లు వేసిన చేలు బీటలు వారాయని, కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీరు అందించి పంటలు కాపాడాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, కౌలు రైతులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం రైతు సేవా కేంద్రం వద్ద ఎండిపోతున్న వరి నారుమడిలో బీటలు వారిన వరి మట్టిగడ్డలతో నిరసన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, రైతులు జిల్లెల్లమూడి ప్రసాదరావు, చిన్ని పోతురాజు, అన్నంరెడ్డి రంగారావు, బైరెడ్డి లక్ష్మణరావు మాట్లాడుతూ అప్పులు తీసుకువచ్చి నారుమళ్లు, నాట్లు వేసిన వరిచేలు ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఏలూరు రూరల్ మండలం కృష్ణా డెల్టా పరిధిలోని వెంకటాపురం, మాదేపల్లి, జాలిపూడి, చాటపర్రు, పోణంగి, కొమడవోలు, కాట్లంపూడి తదితర గ్రామాలలో వేలాది ఎకరాల కృష్ణా డెల్టా భూములకు సాగునీరు అందడం లేదన్నారు. కృష్ణా డెల్టాకు సాగునీరు విడుదల చేశామని, పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు అందిస్తున్నామని ప్రభుత్వం, అధికారులు చెబుతున్నా శివారు ప్రాంత భూములకు ఎందుకు సాగునీరు అందించలేకపోతున్నారని ప్రశ్నించారు. పంటలు ఎండిపోవడంతో అన్నదాతలు కన్నీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కృష్ణా మెయిన్ కెనాల్ నుంచి జాలిపూడి, మాదేపల్లి వైపు వెళ్లే ప్రధాన పంట కాలువ గుర్రపు డెక్క,తూడు, తుక్కు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిందని కనీసం కాలువలు బాగు చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. పంట కాలువలు బాగు చేస్తామని హడావుడి చేశారే తప్ప బాగు చేసింది ఏమీ లేదన్నారు. ఇరిగేషన్ అధికారులు మొద్దు నిద్ర వీడి చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో అన్నదాతల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. స్పందన రాకపోతే 16వ తేదీ సాయంత్రం 3 గంటలకు ఏలూరు కైకలూరు రోడ్డును దిగ్బంధించాలని నిర్ణయించారు.

రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదు



ఎంపీ పాకా సత్యనారాయణ, బీసీవై యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్‌కు సత్కారం

తణుకు అర్బన్: రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచార ఘటనలు పెరిగిపోవడం బాధాకరమని బీసీ చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు ప్రాధాన్యతతో పాటు భద్రత లేకుండా పోతున్న ఘటనలు బాధాకరమన్నారు. తణుకు సురాజ్య భవన్‌లో మంగళవారం బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో మహిళా రాజకీయ రిజర్వేషన్లు, బీసీ మహిళా సబ్ కోటాపై రాష్ట్ర మహిళా సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్నారులపై అత్యాచారాలు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. రాష్ట్రానికి హోం మంత్రిగా ఉన్న మహిళకు కనీసం ఒక ఎస్సైని బదిలీ చేయించే అధికారం కూడా లేకుండా రాజకీయంగా తమ పరిధిలోనే ఉంచుకోవడం అన్యాయమన్నారు. దేశ వ్యాప్తంగా భవిష్యత్తులో జనగణనకు కార్యాచరణ సిద్ధమైందని రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణ తెలిపారు. బీసీ చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్, జిల్లా మహిళాధ్యక్షురాలు కొలగాని కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో జాతీయ ఉపాధ్యక్షుడు కాగిత సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అరటికట్ల త్యాగరాజాచారి, జాతీయ మహిళాధ్యక్షురాలు వై.లక్ష్మిశైలజ, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పీవీ రమణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు అన్నం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మటపత్తి సూర్యచంద్రరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లుక్కా వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్య పెన్షనర్ల ఆందోళన

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని ఇంటర్ విద్య పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెన్షనర్స్ మంగళవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.శ్యాంబాబు, కె.భవన్నారాయణ మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించి ఐఆర్‌ను ప్రకటించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే ప్రకటించాలని కోరారు.

క్లుప్తంగా

ఆర్టీసీ ఏసీ బస్సుల్లో ఆషాఢం ఆఫర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్టీసీ ఏసీ బస్సుల ప్రయాణికులకు ఆషాఢం ఆఫర్ అందిస్తున్నట్టు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి షేక్ షబ్నం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు ఆర్టీసీ డిపోల నుంచి బయలుదేరే అన్ని ఏసీ బస్సుల్లో ప్రయాణికులకు వెళ్లేటప్పుడు 10 శాతం, తిరిగి వచ్చేటప్పుడు 10 శాతం ప్రయాణ చార్జీల్లో రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణం చేయాలన్నారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య


సిరికోటి నర్మద (ఫైల్)

భీమడోలు: గుండుగొలనులో ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన సిరికోటి నర్మద అలియాస్ మౌనిక (20) ఈనెల 13వ తేదీ ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చే సరికి ఆమె విగత జీవిగా పడి ఉంది. ప్రేమ వ్యవహారమే యువతి మృతికి కారణమని అనుమానిస్తున్నారు. నర్మద అమ్మమ్మ కురమా మాణిక్యం ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫిట్స్‌తో కాలువలో పడి..

భీమవరం: ఫిట్స్‌తో ప్రమాదవశాత్తు కాలువ పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు భీమవరం టూటౌన్ ఎస్సై కె రామారావు మంగళవారం చెప్పారు. పట్టణంలోని సత్యవతి నగర్‌కు చెందిన గుమ్మాడి రామచంద్రరావు(32) ఈనెల 13వ తేదీన ఫిట్స్‌తో కాలువలో పడిపోయాడు. అతడిని బంధువులు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రామచంద్రరావు తల్లి రత్నకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామారావు చెప్పారు.

తణుకులో బుల్లెట్ చోరీ


సీసీ ఫుటేజీలో బుల్లెట్‌పై వెళ్తున్న ఆగంతకులు

తణుకు అర్బన్: తణుకులో బుల్లెట్ వాహనం చోరీ చేసిన ఘటన చోటుచేసుకుంది. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీరుగా పనిచేస్తున్న మహమ్మద్ ఆలీషా తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన బుల్లెట్ సోమవారం రాత్రి అపహరణకు గురైందని తెలిపారు. బుల్లెట్‌ను ఇద్దరు యువకులు వేసుకుని వెళ్తున్నట్లుగా సమీపంలోని సీసీ పుటేజీ ద్వారా గుర్తించినట్లు చెప్పారు. బుల్లెట్ చోరీపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆలీషా తెలిపారు.

'మన మిత్ర' యాప్ ద్వారా నీటితీరువా పన్నుల చెల్లింపు

ఏలూరు (మెట్రో): జిల్లాలో నీటితీరువా పన్నులను 'మన మిత్ర' యాప్ ద్వారా చెల్లించవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు 'మన మిత్ర' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని నీటితీరువా పన్నులను చెల్లించాలన్నారు. ఏదైనా సమస్యలు ఎదురైతే 95523 00009 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

గురువుల మెడపై బోధనేతర కత్తి

- నెలరోజులుగా యోగాంధ్ర, మెగా పీటీఎంలతో సరి
- ప్రస్తుతం లీడర్‌షిప్, ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణలతో బిజీ
- ప్రతీ రోజు గంట సమయం ఆన్‌లైన్, యాప్‌ల భారం
- తరగతి గదికి దూరమవుతున్నామంటూ ఉపాధ్యాయుల ఆవేదన


ఆగిరిపల్లిలో స్కూల్ లీడర్‌షిప్ ట్రైనిగ్‌లో పాల్గొన్న ఏలూరు జిల్లా హెచ్‌ఎంలు


బోధనేతర పనులు తగ్గించాలని డీఈవో నారాయణకు విన్నవిస్తున్న ఫ్యాప్టో సభ్యులు

నిడమర్రు: పాఠశాల తెరిచి నెల రోజులు పూర్తవుతున్నా కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ తీసుకుంటున్న నిర్ణయాలతో నేటికీ పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు తరగతి గదికి హాజరుకాలేని పరిస్థితి. ఇప్పటికీ బోధనేతర పనులతోనే ప్రభుత్వ ఉపాధ్యాయులు బిజీబిజీగా గడుపుతున్నారు. రోజు రోజుకీ వాట్సాప్‌లో అర్జెంట్ మెసేజ్‌లు, ఆన్‌లైన్ వర్క్‌లు, వెబ్‌ఎక్స్ మీటింగ్‌లతోపాటు నెలరోజులుగా యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ వంటి కార్యక్రమాలతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఇటువంటి నిర్ణయాలను జీర్ణించుకోలేని నెల్లూరు జిల్లాలోని కోటితీర్థంకు చెందిన ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం ఎం.మధుసూదనరావు తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం చర్చనీయాంశం అయ్యింది. ఉపాధ్యాయుల మెడపై ఇలా భోధనేతర పనుల కత్తి వేలాడుతుండడంతో పాఠశాలల్లో విద్యాప్రమాణాలు లోపిస్తున్నాయి. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో ఆదరణ తగ్గుతోంది. దీంతో ఈ విద్యాసంవత్సరంలో 1వ తరగతిలో విద్యార్థుల నమోదు గణనీయంగా పడిపోయింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 117 పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉందని గణాంకాలు చెబుతుండడం గమనార్హం.

నెలంతా బోధనేతర కార్యక్రమాలే..

- జూన్ 12వ తేదీన పాఠశాలలు తెరిచినా ఎస్జీటీలకు, ఎంటీఎస్, వృత్తి విద్యా టీచర్స్ బదిలీల కౌన్సిలింగ్ నిర్వహణతో పదిహేను రోజులు గడిచిపోయాయి.
- అనంతరం గిన్నిస్ రికార్డు కోసం జూన్ 21న చేపట్టిన యోగాంధ్ర కోసం పాఠశాలల్లో ముందస్తుగానే ఆయా కార్యక్రమాలు చేపట్టింది. వీటిల్లో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు భాగస్వాములయ్యారు.
- ఆ తరువాత ఈనెల 10వ తేదీన తలపెట్టిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం (మోగా పీటీఎం)కు సంబంధించి పది రోజుల ముందగానే వివిధ కార్యక్రమాలు చేపట్టారు.
- హమ్మయ్య.. అది కూడా ముగిసిందనుకుంటే ఈనెల 14 నుంచి స్కూల్ లీడర్ షిప్, ఎఫ్‌ఎల్‌ఎన్ వంటి శిక్షణ కార్యక్రమాలు ఈ నెలాఖరు వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇలా ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాలతో ఉపాధ్యాయులు తరగతి గదులకు దూరమవుతున్నారు. దీంతో తరగతులు సక్రమంగా జరగక పాఠాలు అర్థం కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

మొరాయిస్తున్న యాప్‌లతో ఆందోళన

మరో వైపు మొరాయిస్తున్న యాప్‌లతో సైతం ఉపాధ్యాయులు విసిగిపోతున్నారు. పాఠశాల విద్యాశాఖలో ఉన్న అన్ని యాప్‌లను ఒకే వేదికపైకి తీసుకువచ్చి లీప్ (లెర్నింగ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) యాప్‌ను రూపొందించారు. దాంట్లోనే ఐఎంఎంఎస్, స్టూడెంట్ కిట్స్, మెగాపీటీఎం వంటివాటిని అనుసంధానం చేశారు. దీంతో సర్వర్ డౌన్ సమస్యలతో నేటికీ ఆన్‌లైన్‌లో టీచర్ ఫోటో హాజరు నమోదుకు ఉదయం, సాయంత్రం వేళల్లో 5 నుంచి 15 నిమిషాలు పడుతున్నట్లు ఉపాధ్యాయులు చెపుతున్నారు. ఇదిలా ఉంటే నేటి నుంచి విద్యార్థి మిత్ర కిట్లు విద్యార్థులకు అందినట్లు తల్లిండ్రదులతో బయోమెట్రిక్ వెయించాలని చెబుతున్నారు. కానీ ఏ పాఠశాలలో కూడా దీనికి సంబంధించిన డివైజ్ మిషన్స్ అదుబాటులో లేని పరిస్థితి. పెద్ద స్కూళ్లలో క్లాస్ టీచర్‌కు ఒక వారం రోజులు ఇదే పనిలో ఉండాల్సిందే అని చెబుతున్నారు.

సన్నబియ్యం బస్తా చుట్టూ తిరగాల్సిందే

ఈ ఏడాది నుంచి మధ్యాహ్న భోజన పథకంకు సంబంధిచి పాఠశాలలకు సన్నబియ్యం అందించారు. ప్రతి నెలా పాఠశాలకు అందిన అన్ని బస్తాలపై క్యూఆర్ కోడ్‌లను ఉపాధ్యాయులు స్కానింగ్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. తర్వాత వంటకు ముందు ఆ బస్తా ఓపెన్ చేసిన ప్రతిసారి క్యూఆర్ కోడ్‌ను స్కానింగ్ చేసి ఆ బస్తాలో ఉన్న బియ్యం క్యాలిటీ పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన పరిస్థితి. లేదంటే బియ్యం స్టాక్ గోడౌన్ నుంచి ఉపాధ్యాయులకు ఫోన్‌లు వస్తున్నాయి.

డీఈవో వద్ద ఫ్యాప్టో నేతల ఆవేదన

ఇటీవల పెరుగుతున్న బోధనేతర పనులు, శిక్షణలతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని మంగళవారం ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక (ఫ్యాప్టో) నేతలు జిల్లా విద్యాశాధికారి నారాయణను కలసి ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత ఒత్తిడిలో హెలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు పూర్తి చేయలేదనడం సరికాదన్నారు. ఎస్‌ఎల్‌డీటీ శిక్షణలు జిల్లా కేంద్రాల్లో కాకుండా అగిరిపల్లి, నల్లజర్లలో రెసిడెన్సియల్ విధానంలో ఏర్పాటు సరైన నిర్ణయం కాదని ఫ్యాక్టో నేతలు డీఈవోకు వివరించారు.

ఉపాధ్యాయుల ప్రాణాలతో చెలగాటం తగదు



పాఠశాల ప్రారంభం నెలల్లో జరుగుతన్న శిక్షణలకు అర్ధగట్ల జెడ్పీస్కూల్ హెచ్‌ఎం ఎస్‌వీఆర్ మూర్తిరాజు బలయ్యారు. ఆన్‌లైన్ పనులు, శిక్షణల పేరుతో ఉపాధ్యాయుల ప్రాణాలతో చెలగాటం ఆడడుతున్నారు. ఇలా శిక్షణల పేరుతో టీచర్లను మానసిక ఒత్తిడికి గురి చేయడం తగదు.

– బొర్రా గోపీ మూర్తి, టీచర్స్ ఎంఎల్‌సీ

బోధనేతర పనుల ఒత్తిడిపై ఉమ్మడి పోరాటం



పాఠశాలలు తెరిచి రెండో నెలలో ప్రవేశించినా ఉపాధ్యాయులు సంతృప్తిగా పాఠాలు బోధించిన దాఖలాలు లేవు. యెగా డే, మెగా పేరెంట్స్ మీటింగ్‌కు సంబంధించి ఆన్‌లైన్ నమోదు, శిక్షణలతో ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. బోధనేతర పనులు తగ్గించే వరకూ అన్ని యూనియన్లు ఉమ్మడి పోరాటంకు సిద్ధం కావాలి.

– పుప్పాల ప్రకాశరావు, రాష్ట్ర కార్యదర్శి, ఎస్టీయూ

వైభవంగా సువర్చలా హనుమద్ కల్యాణం


మద్ది క్షేత్రంలో సువర్చలా హనుమద్ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో మంగళవారం సువర్చలా హనుమద్ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు స్వామివారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. పూర్వాభాద్రా నక్షత్రం పురస్కరించుకుని మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ అష్టోత్తర మండపంపై శ్రీ సువర్చలా హనుమద్ కల్యాణ క్రతువు వైఖానస ఆగమ శాస్త్రబద్ధంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని వీక్షించి తరించారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల రూపంలో రూ.1,83,399 సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు.

సారా స్థావరంపై ఎక్సైజ్ దాడులు


పి.అంకంపాలెం సమీపంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెం సమీపంలో సారా తయారీ స్థావరంపై మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని, 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనుబాబు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానాలపై పోరాడాలి


పీడీఎస్‌యూ జనరల్ బాడీ సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

కుక్కునూరు: నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఐక్యంగా పోరాటం చేయాలని పీడీఎస్‌యూ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని లచ్చిగూడెం గ్రామంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు, యువకులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోయం కార్తీక్, తుర్రం నవీన్ మాట్లాడుతూ జీఓ నెంబర్ 117ను రద్దు చేస్తామని వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం జీఓ నెంబర్ 19, 21లతో మరింత నష్టకరమైన తొమ్మిది రకాల బడుల విధానాన్ని ప్రవేశపెట్టడం దారుణమని అన్నారు. జీఓ నెంబర్ 117తో 12 వేల ఏకోపాధ్యాయ బడులు ఏర్పడగా వాటికి మరిన్ని జోడించబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే ఉపాధ్యాయుడితో విద్యా బోధన అసాధ్యం అన్నారు. మూడు, నాలుగు తరగతులను ఉన్నత పాఠశాలకు బదిలీ చేయడం అనాలోచితం, అశాస్త్రీయమని విమర్శించారు. ప్రపంచ బ్యాంక్ ద్రవ్యనిధి ఆదేశాల మేరకు ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను 30 శాతం మేర తగ్గించేందుకు కుట్ర జరుగుతుందన్నారు, ప్రపంచ బ్యాంక్ రుణాలపై ఆధారపడిన ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా 2020 జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చాయని, దీనిపై అందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి


ట్రిపుల్ ఐటీలో మాట్లాడుతున్న డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్

నూజివీడు: పీయూసీలో చేరిన విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ బాగా చదువుకొని ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని నూజివీడు ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ అన్నారు. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు చెందిన పీయూసీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు మంగళవారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డైరెక్టర్ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీలోని విద్యావిధానం పట్ల అవగాహన పెంచుకొని తరగతిలో మెంటార్లు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని చదువుకోవాలన్నారు. ఈనెల 21 నుంచి అకడమిక్ షెడ్యూల్ ప్రకారం తరగతులు జరుగుతాయని, 28 నుంచి స్టడీ అవర్స్ ప్రారంభిస్తామన్నారు. విద్యార్థులంతా స్నేహభావంతో మెలగాలని, అమ్మాయిల పట్ల అనుచితంగా ప్రవర్తించినా, ర్యాగింగ్ జోలికి వెళ్లినా విద్యార్థులను పంపించేస్తామని హెచ్చరించారు. డీన్ అకడమిక్స్ సాదు చిరంజీవి, ఏఓ లక్ష్మణరావు, డీన్ స్టూడెంటు వెల్ఫేర్ బాలురు రాజేష్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ బాలికలు దుర్గాభవాని, చీఫ్ వార్డెన్ సురేష్ బాబు పలు సూచనలు చేశారు. అసోసియేట్ డీన్స్ భరత్, రఘు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: కడుపునొప్పి తాళలేక వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. మండలంలోని ఆగర్తిపాలెం గ్రామానికి చందిన ఎం.నాగభవానీ (24) ఈనెల 13న కడుపు నొప్పి తాళలేక పురుగు మందు తాగి విలవిల్లాడుతుండడంతో గమనించిన బంధవులు ఆమెను హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా సోమవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. నాగభవానీకి భర్త దుర్గాప్రసాద్, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగ భవానీ తండ్రి కట్టా నాగపాత్రాజు ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై బి సురేంద్ర కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీల్లోని గెస్ట్ ఫ్యాకల్టీకి వేతనాలు పెంచాలి


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ అసోసియేషన్ నాయకులు

నూజివీడు: ట్రిపుల్ ఐటీల్లో 2018లో నియమితులైన గెస్ట్ ఫ్యాకల్టీకి వేతనాలను పెంచాలని ట్రిపుల్ ఐటీ కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుస్సేన్ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ అసోసియేషన్ తరుపున మంగళవారం ఆర్జీయూకేటీ రిజిస్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్‌కు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో జాయిన్ అయిన గెస్ట్ ఫ్యాకల్టీకి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా వేతనం పెరగలేదన్నారు. రాబోయే రోజుల్లో జరగబోయే గవర్నింగ్ కౌన్సిల్ ఎజెండాలో ఈ అంశాన్ని పెట్టి ఛాన్సలర్ దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సునీత, భవ్య, రామకృష్ణ, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలని వినతి


రామచందర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

భీమవరం: రాష్ట్రంలో ఇటీవల దళితులపై దాడులు పెరిగిపోయాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కోనా జోసెఫ్ కోరారు. మంగళవారం భీమవరం వచ్చిన జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్, కమిషన్ డైరెక్టర్ జి.సునీల్ కుమార్‌బాబులను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జోసెఫ్ మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, వర్గీకరణతో కొందరు మాల, మాదిగలు రెండుగా విడిపోయి ఘర్షణలకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు భీమవరంలో స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ముందుగా బీఆర్ అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఈది రవికుమార్, కేసి రాజు, గంటా సుందరకుమార్, బి కమలాకర్, టి ప్రశాంత్, పి మునలయ్య, వి రత్నారాజు తదితరులు పాల్గొన్నారు.

వేసవిని మించి.. తారెత్తిస్తున్న ఎండలు

ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు


గూడెంలో ఎండ తాళలేక ముసుగులు వేసుకొని వెళుతున్న కార్మికులు

పెంటపాడు: రోజురోజుకు ఎండలు తారెత్తిస్తున్నాయి. వర్షాకాలంలో వేసవిని మించి ఇలా ఎండలు మండిపోతుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఎండ వేడిమి, ఉక్కపోత తట్టుకులేక అల్లాడుతున్నారు. ఈ విచిత్ర వాతావరణాన్ని తట్టుకోలేక అనేకమంది వ్యాధుల బారిన పడుతున్నారు. ఎండల వల్ల ప్రజలు బయటకు రాకపోవడంతో వ్యాపారాలు కూడా దెబ్బతింటున్నాయి. కార్మికులు, స్కూలుకు వెళ్లే చిన్నారులు ఎండ దెబ్బకు అల్లాడుతున్నారు. కాగా ఖరీఫ్ సాగు పనులు ఇప్పటికే ప్రారంభం కాగా వర్షాలు లేకపోవడం, ఎండ వేడికి నాట్లు దెబ్బతినే అవకాశం ఉండడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

వేళాపాళా లేని విద్యుత్ కోతలు

అప్రకటిత విద్యుత్ కోతలతో తాడేపల్లిగూడెం నియోజకవర్గం ప్రజలు అల్లాడుతున్నారు. సమయం, సందర్భం లేకుండా లైన్ క్లియరెన్స్, జంగిల్ క్లియరెన్స్, మెయింటెనెన్స్ వర్కులు అంటూ రోజూ ఏదో ప్రాంతంలో కోతలు విధిస్తున్నారు. రాత్రి సమయాల్లో అయితే ఇక చెప్పనక్కరలేదు. దీంతో కరెంటు లేక, ఉక్కపోత తట్టుకోలేక చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు బెడద కూడా ఎక్కువగానే ఉంది. పెంటపాడు, గూడెం ప్రాంతాల్లో ప్రతిరోజూ 10 గ్రామాల చొప్పున విద్యుత్ కోత ఉంటోంది. ఈ సమస్య ఎప్పటికీ తీరుతుందో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు.

విదేశీ కోకో గింజల దిగుమతులను నిలుపుదల చేయాలి

కోకో రైతుల సదస్సు డిమాండ్


సదస్సులో సంఘటితంగా పోరాడేందుకు సిద్ధమైన రైతు సంఘం, సీఐటీయూ నాయకులు, కోకో రైతులు

ద్వారకాతిరుమల: విదేశీ కోకో గింజల దిగుమతులను నిలుపుదల చేసి, కోకో రైతులకు అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర చెల్లించేలా ఫార్ములా రూపొందించాలని, అందుకు రాష్ట్ర కోకో బోర్డును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని పంగిడిగూడెం జెడ్పీ హైస్కూల్ వద్ద ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం ఆధ్వర్యంలో, కోకో రైతుల ప్రాంతీయ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకుడు రుద్రరాజు సుబ్బరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోకో రైతుల సమస్యలపై చర్చించి, పలు తీర్మానాలను ఆమోదించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కోకో పంటను మరింతగా ప్రోత్సహిస్తామని, ప్రస్తుతం ఉన్న 75 వేల ఎకరాలకు అదనంగా మరో లక్ష ఎకరాల్లో కోకో పంట సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తామని ప్రకటించిందన్నారు. ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న కోకో గింజలను మార్కెట్లో అమ్ముకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరో లక్ష ఎకరాలు పెంచితే ఆ పంటను రైతులు ఎక్కడ అమ్ముకోవాలని ప్రశ్నించారు. సరైన మార్కెటింగ్ సౌకర్యం లేకపోతే కోకో రైతులు మరింతగా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి అచ్యుతరామయ్య, కోనేరు సతీష్ బాబు మాట్లాడుతూ కోకో రైతులంతా రైతు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడి భవిష్యత్తులో తమ కోకో గింజలను మార్కెటింగ్ చేసుకునేలా కోకో రైతులంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఆ తరువాత సీఐటీయూ నాయకులు ఆర్.లింగరాజు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు మాట్లాడుతూ ప్రపంచీకరణ విధానాల వల్ల విదేశీ ఫ్రీ ట్రేడింగ్ అగ్రిమెంట్స్‌తో వాణిజ్య, వ్యాపార పంటల రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కోకో రైతులు చేస్తున్న ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. ఈ సదస్సులో ఎస్.నాగబాబు, పి.ప్రసాద్, వి.వెంకటేశ్వరరావు, తూంపాటి అజయ్ కుమార్, ఎం.మురళీ, నల్లూరి బాపనయ్య, పలు ప్రాంతాలకు చెందిన కోకో రైతులు పాల్గొన్నారు.

చేపల పెంపకంపై శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్), బాదంపూడి: ఉంగుటూరు మండలం బాదంపూడిలోని దేశీయ జల మత్స్య సంవర్ధణ శిక్షణ కేంద్రంలో చేపల పెంపకంపై శిక్షణ పొందుటకు ఈనెల 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మత్స్య శాఖ అధికారి బి.నర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకార వేతనాలు లేకుండా 20 సీట్లు ఉన్నాయన్నారు. 5వ తరగతి ఆపైన చదువుకుని చేపల పెంపకంపై ఆసక్తి కలిగిన 18 నుంచి 30 సంవత్సరాల లోపు ఉన్న వ్యక్తులు అర్హులన్నారు. దరఖాస్తుదారులకు ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు బాదంపూడిలోని మత్స్య శాఖ సహాయ సంచాలకుల వారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అదేరోజు సాయంత్రం కార్యాలయం నోటీసు బోర్డులో ఎంపికైన వారి జాబితా ప్రదర్శించడం జరుగుతుందన్నారు. శిక్షణా కాలం ఆగస్టు 1 నుంచి అక్టోబరు 31వ తేదీ వరకు మూడు నెలలపాటు ఉంటుందన్నారు. వివరాలకు మత్స్య సహాయ సంచలకులు, బాదంపూడి 95733 37484 లేదా మత్స్య అభివృద్ధి అధికారి, బాదంపూడి–1 72869 93033, బాదంపూడి–2 94923 37469 నంబర్లలో సంప్రదించాలని జిల్లా మత్స్య శాఖాధికారి నర్సయ్య తెలియజేశారు.

ప్రజల వద్దకు రచ్చబండ

- ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రశ్నించాలి
- మాజీ డిప్యూటీ సీఎం 'కొట్టు' పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై రచ్చబండ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని మాధవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం తదితర పథకాల అమలు తీరుపై ప్రజల అభిప్రాయాన్ని సేకరించాలన్నారు. ఇకపై పార్టీని సంస్థాగతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వ పనితీరును నిలదీయాలన్నారు. గ్రామ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయిలో గత ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలను వివరిస్తూ జగన్ 2.0 ఏ విధంగా ఉండబోతుందనేది ప్రజలకు తెలియజేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. 18 నుంచి 60 ఏళ్ల లోను మహిళలకు నెలకు రూ.1500లు చొప్పున ఇస్తామని చెప్పారని, 14 నెలల్లో ఎంత మందికి ఇచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగాలిస్తామని నమ్మబలికారన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీకి దారి తెన్ను లేదని ఎద్దేవా చేశారు. మోసం ఎంతో కాలం సాగదన్నారు. కొద్ది కాలం మాత్రమే ఎవరినైనా నమ్మించగలరన్నారు. కరోనా సమయంలోనూ సమర్థవంతమైన పాలనను జగన్ అందజేశారని గుర్తు చేశారు. నాడు – నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, అమ్మ ఒడి తదితర పథకాల ద్వారా జగన్ సంఘ సంస్కర్తగా నిలిచారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకుమారి, జిల్లా స్పోక్స్ పర్సన్ ముప్పిడి సంపత్‌కుమార్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ కర్రి భాస్కరరావు, పెంటపాడు మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, మీడియా ఇన్‌ఛార్జ్ బొద్దాని శ్రీనివాస్, నాయకులు తమ్మిశెట్టి చుక్కయ్య, ముళ్లపూడి రామకృష్ణ, దండే గోతియ్య మాట్లాడారు. వెలిశెట్టి నరేంద్రకుమార్, పరిమి తులసీదాస్, ఆలపాటి కాశి, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కనుపూరి ఉదయభాస్కర్, తారమట్ల శ్రీనివాస్, వెంపలి వీరభద్రరావు, గుండుమోగుల సాంబయ్య, కట్టా రంగబాబు, సూర్పని రామకృష్ణ, గంటి చిన సర్వేశ్వరరావు, ప్రత్తి రఘు, రాజాబాబు, ప్రత్తి రంగనాయకులు, సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.



పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

పొగాకు ఉత్పత్తుల వినియోగం ప్రాణాపాయం



తణుకులో విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డాక్టర్ ధనలక్ష్మి

తణుకు అర్బన్: పొగాకు ఉత్పత్తుల వినియోగం వలన ప్రాణాపాయం దిశగా పయనించాల్సి వస్తుందని నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ధనలక్ష్మి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన, చిత్రలేఖన, స్లోగన్స్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మంగళవారం బహుమతులు అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ధనలక్ష్మి మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు వాడకం వలన మానవ దేహంలో అతి ముఖ్యమైన గుండె, ఊపిరితిత్తుల వ్యవస్థ పాడై పోతుందని స్పష్టం చేశారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకే ప్రమాదం కూడా పొంచి ఉంటుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పొగాకు తాగకూడదని, ఇళ్లలో సైతం పిల్లలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులు పీల్చరాదన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థినులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిడెమిలోజిస్ట్ జి.సుభాష్, సోషల్ వర్కర్స్ సాదు భాయ్, బాల, జిల్లా పరిషత్ స్కూల్ సెక్రటరీ కె.సోమేశ్వరరావు, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, డ్రాయింగ్ టీచర్ చింతపల్లి దుర్గాప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలి



అత్తిలి గ్రామసచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

అత్తిలి: ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాడేపల్లిగూడెం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి ఎం.ప్రభాకరరావు అన్నారు. అత్తిలి గ్రామ సచివాలయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 0–5 సంవత్సరాల పిల్లలకు కొత్త ఆధార్‌నమోదు, ఆధార్ అప్‌డేట్ చేయించడం, మార్పులు చేసుకోవడం, మొబైల్ నెంబర్లు లింకు చేసుకోవడం తదితర కార్యక్రమాలను క్యాంపులో అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల 15 నుంచి 18 వరకు తిరిగి 22 నుంచి 25 వరకు అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

20 మందికి ఉచిత వైద్యం



తణుకులో వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని కార్యాలయంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి హాజరైన 20 మంది రోగులకు సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలందించారు. బీపీ, సుగర్ ఉచిత పరీక్షలు నిర్వహించి, పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులు తీసుకోవాల్సిన ఆహార అలవాట్లు, క్రమం తప్పకుండా మందుల వాడకం వంటి విషయాలపై డాక్టర్ రమేష్‌చంద్రబాబు రోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, తణుకు శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కార్యదర్శి కోసూరి గాంధీ, సభ్యులు మద్దా అలివేలు మంగమ్మ, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.


పొలం పిలుస్తోంది



కోనాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో రాజేంద్రప్రసాద్

తణుకు అర్బన్: తణుకు మండలంలోని కోనాల, వేల్పూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మండల వ్యవసాయ అధికారి కె.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ సార్వా సీజన్లో వరి సాగు చేసే ప్రతి రైతు ఎకరానికి రూ. 210 రూపాయల ప్రీమియం చెల్లించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం పేరు నమోదుచేసుకుని పంటల బీమా పథకానికి అర్హత పొందాలని సూచించారు. ఈ పథకంలో అర్హత పొందుటకు ఆగస్టు 15 చివరి తేదీగా నిర్ణయించారని, ఇతర సమాచారం కోసం గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోనాల ఎంపీటీసీ సభ్యులు ఎం.సత్యనారాయణ, వీఏఏలు మల్లికార్జున్, అయ్యప్ప, రాము, వీహెచ్‌ఏలు సోనియా, ఏహెచ్‌ఏ స్వామి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది విశాలాక్షి, రాము, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



మంత్రి నారాయణకు వినతిపత్రం ఇస్తున్న మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం వచ్చిన మునిసిపల్ మంత్రికి మంగళవారం ఇంజనీరింగ్ కార్మికులు జీతాలు పెంచాలని, ఇటీవల జరిగిన సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన వంతెన



శిథిలమవుతున్న వంతెన భాగం

నరసాపురం: పట్టణంలోని పాలకొల్లు రోడ్డులో ఉన్న మత్స్యపురి వంతెన శిథిలమైంది. నరసాపురం నుంచి మత్స్యపురి మీదుగా భీమవరం వెళ్లే వారు ఈ వంతెన మీదుగా ప్రయాణించాలి. దీంతో ఈ వంతెనను మత్స్యపురి వంతెనగా పిలుస్తారు. అయితే ఈ వంతెన దాదాపుగా శిథిల దశకు చేరింది. వంతెనపై మూడు చోట్ల గోతులు పడ్డాయి. సైడ్‌వాల్స్ కూడా శిథిలమయ్యాయి. కానీ వంతెనకు రోడ్లు భవనాల శాఖ ఎలాంటి మరమ్మతులు చేయడం లేదు. దీంతో ఈ వంతెన మీదుగా ప్రయాణించే వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా వంతెన మరమ్మతులపై దృష్టి పెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

24న దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల శిబిరం

ఉండి: నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు అందించేందుకు ఈ నెల 24న ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండలాల పరిధిలోని దివ్యాంగుల నిర్ధారణా కార్యక్రమాన్ని ఉండి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎంవీఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశబూరు. దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్లు, చేతులు, వినికిడి సాధనాలు అందించేందుకు నిర్వహించే ఈ కార్యక్రమానికి వచ్చే దివ్యాంగులు తమ ఆధార్, సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, రెండు ఫోటోలు తీసుకుని రావాలని కోరారు. ఉదయం 10 గంటలకు నుంచి శిబిరం ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



యాంటీలార్వా స్ప్రేయింగ్‌ను పర్యవేక్షిస్తున్న తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

అత్తిలి : మురుగు డ్రెయిన్‌లు, సుదీర్ఘ నీటినిల్వ కుంటలపై యాంటీ లార్వా స్ప్రేయింగ్ చేయడం వల్ల లార్వా దశలోనే దోమ పుట్టుకకు అడ్డుపతుందని తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం అత్తిలి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాంటీ లార్వా ఆపరేషన్‌ను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజలు డ్రెయిన్‌లలో చెత్త వేయవద్దని, చెత్త వేయడం వలన మురుగు నీరు పారుదలకు ఆటంకం కలిగి, తిరిగి దోమల పుట్టుకకు స్థావరాలుగా మారతాయన్నారు. చెత్తను డస్ట్ బిన్‌లో మాత్రమే వేయాలని, డ్రెయిన్ అనేది మురుగునీరు పోడానికి అని వివరించారు. ప్రజలందరూ ఈ వర్షాకాలం అన్ని రోజులు, తమ గృహాల ఆవరణలో స్తబ్దతతో కూడిన నీటినిల్వలు లేకుండా ప్రతి రోజూ డ్రైడే పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరాజు, హెల్త్ అసిస్టెంట్ జెఎస్ గనిరాజు, సెక్రటరీ జి భాస్కర్, ఆరోగ్య కార్యదర్శులు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ జి గీతాబాయి

అత్తిలి: ఆసుపత్రిలో సహజ ప్రసవాలు ఎక్కువగా జరిగే విధంగా చూడాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ జి గీతాబాయి పీహెచ్‌సీ వైద్యులకు సూచించారు. మంగళవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీ స్త్రీలకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అందిస్తున్న ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్‌ల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారపదార్థాలను వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం అత్తిలి గ్రామంలో చేపట్టిన దోమల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను ఆరా తీసారు. దోమల నిర్మూలనకు గ్రామంలో యాంటీ లార్వా మందును పిచికారీ చేస్తున్నామని వైద్యాధికారి ఆమెకు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి చికిత్స పొందుతున్న వారివద్దకు వెళ్లి ఆరోగ్య సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఆసుపత్రికి సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. హెచ్ఈ జి ప్రమీలారాణి, హెచ్‌వీ ఎ అమ్మాజీ, ఎంపీహెచ్ఏ జెఎస్ గనిరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండా సూరిబాబు

పెనుగొండ: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మండా సూరిబాబు అన్నారు. ఈ నెల 18న భీమవరంలో జరగనున్న జిల్లా డెల్టా బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్ యూనియన్ ఐదో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం ఆచంటలో మహాసభల కరపత్రన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశాయని, ఈ సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు, కార్మికుల పిల్లలకు, కుటుంబాలకు అనేక సదుపాయాలతో పథకాలు అమలు చేశారన్నారు. అనంతకాలంలో ప్రభుత్వాలు ఈ సంక్షేమ బోర్డు నిధులను పక్కదారి పట్టించాలని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు అమలు చేయాల్సిన అనేక క్లైయిమ్‌లు పెండింగ్లో ఉన్నాయని వాపోయారు. కార్మికులకు ఉపాధిని కాపాడాలని, ప్రమాదాలకు గురైన కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి వివిధ వృత్తుల్లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల్ని కదిలించి ఉద్యమించేందుకు, అవసరమైన కార్యచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఈ మహాసభలు ఎంతగానో ఉపయోగపడతాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు, మండల నాయకులు కేత నాగాంజనేయులు, పూసల ఏడుకొండలు, బుల్లబ్బాయి, వెంకటేశ్వర్లు, ప్రసాద్, విగ్నేశ్వరుడు, సత్యనారాయణ, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మోసం చంద్రబాబు నైజం



అత్తిలి: మంచిలి గ్రామంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు



ఇరగవరం: సూరంపూడి గ్రామంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ బ్రోచర్‌తో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి
- మంచిలి, ఇరగవరంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం

అత్తిలి: కూటమి పాలన పట్ల ప్రజలు విసుగుచెందారని వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు సత్తి చిన్నురెడ్డి అన్నారు. మంగళవారం అత్తిలి మండలం మంచిలి గ్రామంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. ఈసందర్భంగా చిన్నురెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో పథకాలు ప్రకటించి వాటిని ప్రజలకు అందించకుండా చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దారం శిరీషా, మాజీ సొసైటీ అధ్యక్షుడు పీవీఎస్, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు వేంద్ర రాంపండు, చింటురెడ్డి, పార్టీనాయకులు బొంతా యశోద, రాంబాబు, ధనరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరగవరంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ

ఇరగవరం: మండలంలోని సూరంపూడి, తూర్పువిప్పర్రు గ్రామాల్లో మంగళవారం మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ మోసం, వంచనకు కూటమి ప్రభుత్వం కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, ప్రజల్ని మోసం చేసి వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమాన్ని, ప్రస్తుత కూటమి హయాంలో సంక్షేమాన్ని ఎగ్గొట్టి చోద్యం చూస్తున్న విధానాన్ని ప్రజానీకం గమనిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు ఏవిధంగా మోసపోయారనే విషయాన్ని పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే విధంగా క్యూఆర్ కోడ్ ఉన్న కరపత్రాలను ప్రజలకు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రతి గడపలోను ప్రజలు తమను సాదరంగా స్వాగతిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, ఉపాధ్యక్షుడు జాలి సుబ్బరావు, కటరి రామరాజు, మామిడిపల్లి శ్రీను, చోడే ఏసురత్నం, కిషోర్, గంజి సతీష్, సైపురెడ్డి పెద్దిరాజు, మామిడిశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ కార్యకర్తలుపాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించకుండా ప్రజలు తిరస్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ పిలుపునిచ్చారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు తిరస్కరించాలని విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలని కోరుతూ మంగళవారం ఆచంట మండలంలో ఆచంట, పెద్ద పేట, చెమ్మచెరువు, మానేవారిపాలెం, బాల వారి పాలెం, శేషమ్మ చెరువు, వంకతాళ్ల చెరువు, పద్మనాభం చెరువు, తూర్పు పాలెం, కొనపోతుగుంట గ్రామాల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించి అనంతరం ఆచంట కవేరి సెంటర్లో బహిరంగ సభ నిర్వహించారు ఈ సందర్భంగా స్మార్ట్ మీటర్ల వల్ల వచ్చే అనర్థాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గోపాలన్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు వద్దు పగలగొట్టండని చెప్పి కోర్టులో కేసులు వేసిన టీడీపీ నేతలు ఇప్పుడు ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి అనేక రూపాల్లో విద్యుత్ చార్జీలు పెంచుతున్నారని ధ్వజమెత్తారు. పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని ప్రజలు వినియోగించిన విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ మళ్లీ సర్ చార్జీల పేరుతో రెండోసారి వసూలు చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, పోడూరు మండల కన్వీనర్ కాకర వెంకటేశ్వర్లు, పిల్లి ప్రసాద్, బత్తుల విజయకుమార్, తలుపురి బుల్లబ్బాయి, ఎస్‌వీఎన్ శర్మ, సిర్రా నరసింహమూర్తి పాల్గొన్నారు.

పంట బీమాపై రైతులకు అవగాహన

పెనుగొండ: పెనుగొండ, మునమరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంట బీమా ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. రైతులందరూ ఎకరాకు 210 రూపాయలను ప్రీమియంగా చెల్లిస్తే 42,000 వరకు బీమా పొందవచ్చని అధికారులు తెలిపారు. అలాగే నారుమడుల్లో, ప్రధాన పొలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఎరువుల వినియోగంపై అవగాహన

కాళ్ల: సాగులో పచ్చిరొట్ట ఎరువులు, కంపోస్టు వినియోగించడం వల్ల 15 నుంచి 20 శాతం వరకు ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చని కాళ్ల వ్యవసాయ అధికారి బి.రమేష్ నాయుడు తెలిపారు. కాళ్ల మండలం కోపల్లే గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సార్వా నాట్లు వేసే సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. సార్వా సాగులో ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు.

పైడిపర్రుకు కరెంటు కోత

- ఉక్కపోతతో అల్లాడిపోతున్నామంటున్న ప్రజానీకం
- గతంలో ఇలా లేదంటున్న వైనం
- సత్వర సేవలు క్షీణించాయని ఆరోపణలు
- ఇదేనా మంచి ప్రభుత్వం అంటూ నిలదీత



పైడిపర్రులో ఒక వీధి

తణుకు అర్బన్: పైడిపర్రు ప్రాంతవాసులకు కరెంటు కోతలు షాకిస్తున్నాయి. కొంతకాలంగా నిత్యం కరెంటు కోతలతో ఇళ్లలో ఉండలేక బయటకు రాలేక అల్లాడిపోతున్నామంటూ పైడిపర్రువాసులు గగ్గోలు పెడుతున్నారు. రోజుకు 24 గంటల్లో సుమారుగా 5 నుంచి 6 గంటల పాటు కోత విధిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఒక్కసారిగా కాకుండా అడపాదడపాగా తీస్తూ ఇస్తూ భూమ్మీదే నరకం చూపిస్తున్నారని వాపోతున్నారు. కరెంటు ఆఫీసులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని, ఫోన్‌లు కూడా పనిచేయడం లేదని మండిపడుతున్నారు. అసలే గత వారం రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా తీవ్రమైన ఎండతో ఉక్కపోతగా ఉంటుందని ఆపై కరెంటు కట్‌తో ఇళ్లలో ఉండలేకపోతున్నామని, చిన్న పిల్లలను ఊరుకోబెట్టలేక ప్రాణం నీరసించిపోతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఎన్నడూ లేదిలా..

గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో ఎప్పుడూ కరెంటు కోతలు లేవని వేసవి ఎండల తీవ్రత ఉన్నప్పటికీ పవర్ కట్ అనే మాట ఎన్నడూలేదని మరి ఇప్పుడు ఎందుకు ఇలా చేస్తున్నారని ప్రజానీకం దుమ్మెత్తిపోస్తున్నారు. కరెంటు లేదనే మాటే లేకుండా ఐదేళ్లు గడిచాయని ప్రభుత్వం మారగానే కరెంటు కోతలు ఎందుకు వస్తున్నాయని నిలదీస్తున్నారు. ఇప్పటికే కరెంటు బిల్లులు చూసి భయపడుతుంటే మరోపక్క కోతలు ఏంటని గగ్గోలు పెడుతున్నారు. మంచి ప్రభుత్వం అంటే ఇదేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

విద్యుత్ శాఖ పనితీరుపై విమర్శలు..

కరెంటు కోతల విషయంలో అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా లైన్లు ట్రిప్ అయిపోతున్నాయనే సమాధానం వస్తుందని, కొన్ని సందర్భాల్లో ఫిర్యాదు చేద్దామంటే సబ్ స్టేషన్‌లలో అసలు ఫోన్‌లు పనిచేయకుండా చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం తీవ్రస్థాయిలో ఉందని, గతంలో ఫోన్ చేసిన వెంటనే సర్వీసు నంబరు అడిగి ఇంటి ముందు వాలిపోయే వారని నేడు ఆ తరహా సేవలు లేవని వాపోతున్నారు. తణుకు సబ్ డివిజన్ పరిధిలోని కొందరు అధికారులు స్థానికంగా ఉండకపోవడం దూర ప్రాంతాల నుంచి విధులకు హాజరుకావడంతో కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బంది కూడా అదే తరహాలో విధులు నిర్వర్తిస్తుండడంతో సత్వర సేవల్లో జాప్యం కలుగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సమస్యలపై తణుకు సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బోడపాటి దివాకర్‌ను సాక్షి వివరణ కోరగా తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు.